


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 15 పుష్యం : 40-42 20-04-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16

**VOL : 7** **ISSUE : 15**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

20-04-2002

## కాలం

మనము భూమి మీదకు వచ్చాము అంటే వెయ్యి సంవత్సరాలు ఉండబోము. వెనక్కి తిరిగి చూచుకుంటే, అంతా స్వప్న తుల్యమే. ఈ అనంత కాల సాగరంలో మనిషి జీవితకాలం కేవలం ఒక నీటి బుడగ మాత్రమే. మన చేతిలో ఉన్న వర్తమానకాలాన్ని వదిలేసి, భూత, భవిష్యత్ కాలముల గురించి ఆలోచించుట అవివేకము. వర్తమానకాలం లేకుండా భూత, భవిష్యత్ కాలములు లేవు. వర్తమానకాలంలో అనగా ఇప్పడే, ఇక్కడే, ఈ క్షణంలోనే, స్వరూపాన్ని (ఆత్మను) అనుభవంలోనికి తెచ్చుకోవాలి. 'ఆత్మ' దేశాన్ని, కాలాన్ని అతిక్రమించి ఉంది. ఒక్క బ్రహ్మము తప్పించి సృష్టిలో ప్రతీది మనస్సుచే కల్పింపబడినదే. దేశము, కాలము, పరిసరాలు ఇవి అన్నీ మనస్సు పరిధిలోనివే. 'ఆత్మ' దేహేంద్రియ మనో బుద్ధులకు అతీతమైనది. అజ్ఞానికి 'నేను' అంటే దేహానికే పరిమితమైన నేను. జ్ఞాని దృష్టిలో నేను అంటే అనంతమైన 'ఆత్మ'. వర్తమాన కాలం సద్వినియోగం కావాలంటే నిరంతరం అహంకారం పుట్టుచోటును వెదకాలి, అదే సాధన. సాధన చెయ్యకుండా వర్తమానకాలాన్ని వృధా చేస్తే, మానవజన్మ వచ్చిన ప్రయోజనం ఉండదు. జరిగిపోయిన కాలములోని సంఘటనల మీద 'ఆసక్తి' లేకపోతే అంతా వర్తమానమే. మనస్సు ఎప్పడూ కాలంతోపాటే ఆలోచిస్తుంది. కాలానికి అతీతంగా ఎదిగితే అంతా వర్తమానమే అవుతుంది. ఒక్క క్షణకాలమైనా వృధాపుచ్చకుండా 'ఆత్మ' చింతనలో కాలం గడిపేవారు ధన్యులు, వారే పుణ్య శీలురు, వారే పూర్ణ వైరాగ్య భాగ్యం పొందినవారు.

**చావలి సూర్యనారాయణ మూర్తి**
టీచర్, అమలాపురం

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

11-03-2002 కొమ్మర ........ 3
24-03-2002 చిలుకూరు ........ 8
05-04-2002 జిన్నూరు ........ 13

Visit us @ www.srinannagaru.com

**మహావాక్యాలూ, వాటి అర్థనిర్ణయాలూ అంతులేని చర్చలకు దారితీసి సాధకుల మనస్సులను బహిర్ముఖంగా ప్రసరింపజేస్తూ వుంటాయి. మనస్సును అంతర్ముఖం చెయ్యాలంటే సాధకుడు సూటిగా 'నేను'లో నిలకడ సంపాదించుకోడం అవసరం. బాహ్యాప్రవృత్తు లంతరించి అతని కప్పుడు పరమశాంతి చేకూరుతుంది.**

- భగవాన్ శ్రీ రమణ మహర్షి

రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 11-3-02, కొమ్మర)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భక్తిపేరుమీద ఇంటి దగ్గర పనుల విషయంలో అశ్రద్దగా ఉండవలసిన పనిలేదు. పనికి జ్ఞానానికి విరోధంలేదు. మీరు చేసుకొనేపని శ్రద్దగా చేసుకోవాలి. పని విడిచిపెడితే జ్ఞానంరాదు, సోమరితనం వస్తుంది. మనం చేసే పని దుఃఖానికి కారణం కాదు, మమకారమే దుఃఖానికి కారణం. అయితే ఏపనిచేసినా మంచి మనస్సుతో చేయాలి. సుఖంకోసం, శాంతికోసం మనం ఇతరులమీద ఆధారపడినంతకాలం మనకు జన్మలు వస్తూనే ఉంటాయి, దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. అంటే డిపెండెన్స్ వలన దుఃఖం వస్తుంది. ఇండిపెండెన్స్ వలన దుఃఖం నుండి, విడుదల పొందుతాము. మనకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారితో, మనకంటే మంచివారితో సహవాసం చేయాలి. సాధనచేసేకొలది మనం అజ్ఞానం నుండి, దుఃఖం నుండి విడుదల పొందుతున్నాము అని మనకు తెలుస్తూ ఉంటుంది. మనస్సు పూర్తిగా నశించినప్పుడు ఈశరీరం మరణించకముందే ఇక్కడే మనం మోక్షశాంతిని పొందవచ్చును. పూజ ఎంతముఖ్యం అని అనుకొంటున్నామో, ధ్యానం ఎంత ముఖ్యం అని అనుకొంటున్నామో పనికూడా అంతే ముఖ్యం. ధ్యానం వలన నేర్చుకొనే విషయాలు కొన్ని ఉంటాయి. స్వార్థం లేకుండా పనిచేయటంవలన నేర్చుకొనే విషయాలు కొన్ని ఉంటాయి. వీటివలన మనం అజ్ఞానంలో నుండి విడుదల పొందుతాము. సాధకుడు ప్రతీక్షణం బహుజాగ్రత్తగా ఉండాలి. వివేకాన్ని కాపాడుకోవాలి. మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి అని ఏక్షణానికి ఆ క్షణం జాగ్రత్తగా చూసుకోవాలి. మనలను మనం బాగుచేసుకోవటానికి, మనచైతన్యస్థాయి పెంచుకోవటానికి ప్రయత్నం చేయాలిగాని ఎవరో వచ్చి ఉద్దరిస్తారని కనిపెట్టుకొని ఉంటే చివరకు బానిసత్వం వస్తుంది. మనంతట మనం కృషి చేసుకోవాలి. మనకంటే వివేకవంతులతోటి, మనకంటే మంచివారి తోటి సహవాసం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. ఆద్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి కృషి చేసేటప్పుడు సత్వగుణం అభివృద్ధి చేసుకొంటూ వెళ్ళాలి, యాక్షన్ పెంచుకొంటూ వెళ్ళాలి, రియాక్షన్ తగ్గించుకొంటూరావాలి. జీవితంలో వచ్చే సంఘటనలను సమన్వయం చేసుకొంటూ ఉండాలి. అన్నీ మనం అనుకొన్నట్లే జరగవు. మనంచేసేపని నిర్మలంగా చేయాలి. ఎవరైనా ఉద్రేకపరచినా, ఉద్రేకపడకూడదు. మనలను గమ్యానికి తీసుకొనివెళ్ళే మార్గాన్ని విడిచిపెట్టకూడదు, బహుజాగ్రత్తగా జీవించాలి. పూజగదిలో ఎంతశాంతిగా ఉంటున్నారో పనిచేస్తూ పనిమధ్యలో కూడా అంతశాంతిగా ఉండటానికి ప్రయత్నం చేయాలి. మనం చేసేసాధన మనోనాశనానికి సహకరించాలి. సాధన యొక్క గమ్యం ఏమిటో మర్చిపోకూడదు.

మనచేసే పని ద్వారా దేహాభిమానం పెరగకుండా చూసుకోవాలి. భగవంతుడు మనకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేయాలి. దానినుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేస్తే ఆపనినే రాబోయే జన్మలో మనచేత చేయిస్తాడు. దేహప్రారబ్దమును బట్టి అనేక సంఘటనలు ఎదురవుతాయి. నీవు వాటితో తాదాప్యం పొందకుండా ఉండగలిగితే మోక్షశాంతిని ఇప్పడే అనుభవించవచ్చు. రూపబుద్ధి, నామబుద్ధి నుండి విడుదల పొందటం మీదే మీ సాధన అంతాగురిపెట్టాలి. రూపబుద్ధి, నామబుద్ది నుండి విడుదల పొందకపోతే మీది ఏకులం అయినా, ఏమతం అయినా , మీ గురువు ఎవరైనా మీరు అజ్ఞానంలో నుండి బయటకు రాలేరు. ఈప్రపంచంలోనికి వచ్చిన జాడ తెలియకుండా ఎవరైతే నిర్మలంగా, నిరాడంబరంగా పనిచేసుకొని వెళ్ళిపోతారో వారికి జ్ఞానం కలుగుతుంది. మనలో మంచితనంలేదు అనుకో, మనకు శాంతి లేదు అనుకో. మనకు ఆనందంలేదు అనుకో అది ఇతరులలో ఉన్నా అది మనకు కనబడదు. కృష్ణుడు మనకు అర్థమవ్వాలంటే, ఆయన చెప్పినగీత మనకు అవగాహన అవ్వాలంటే ఆయన ఏ చైతన్యస్థాయిలో ఉండి అది చెప్పాడో ఆచైతన్యస్థాయికి మనం ఎదిగితే అది మనకు అర్థమవుతుంది గాని లేకపోతే అర్థంకాదు. జ్ఞానం కావాలంటే ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికి పారిపోనక్కరలేదు. నీకు ఉన్న వాంఛలను, మమకారాన్ని తగ్గించుకొంటే సరిపోతుంది. ఎంతోకొంత రాజీపడకుండా జీవితంలో ఏది జరగదు. మీపద్ధతిలో మీరు జీవిస్తూ ఇంట్లో వ్యక్తులతో, బాహ్య పరిస్థితులతో రాజీపడుతూ మీరు సాధనచేసుకొంటూ తరించండి అంతేగాని మీ గమ్యాన్ని విడిచిపెట్టవద్దు. లోకంలో ఎక్కడా ఏమిలేదు. ఉన్నదంతా నీహృదయంలోనే ఉంది. సుఖం, శాంతి, ఆనందం బయటలేదు. నీహృదయంలోనే ఉంది అని చెప్పి ఎక్కడయితే సత్యవస్తువు ఉందో అక్కడ నీచేత అన్వేషింప చేసేవాడే నీ గురువు. ఎవరినీ ద్వేషించవద్దు, మీప్రేమను విస్తృతం చేయండి. భగవంతుడిలో ప్రేమ, దయ, శాంతి, ఆనందం ఇవి అన్నీ ఉన్నాయి కాబట్టి అవి మనకు వస్తున్నాయి. ఎక్కడ సుఖం, శాంతి, ఆనందం ఉన్నాయో అక్కడ మనం ఐక్యం అవ్వాలి, అది జ్ఞానం. సొంత ఆలోచనను విడిచిపెట్టవద్దు. వివేకాన్ని విడిచిపెట్టవద్దు. నీవు నిజంగా మోక్షాన్ని కోరుతూ ఉంటే, ఆత్మజ్ఞాన సముపార్జన చేయాలనుకొంటే నీప్రేమను ఒక జాతికో, ఒకమతానికో, ఒక కులానికో పరిమితం చేయవద్దు. నీప్రేమను విశ్వవ్యాప్తం చెయ్యి, అప్పడు నీహృదయం విశాలమవుతుంది. ఇప్పడు మనగురించి మనం ఎలా ఆలోచించుకొంటున్నామో అలాగ ఇతరులగురించి ఆలోచిస్తే ఇతరుల క్షేమంకోసం ఆలోచిస్తే మిథ్యానేను దానంతట అదే సహజంగా నశించిపోతుంది. భగవాన్, బుద్దుడు గృహపరిత్యాగం

చేసారంటే వారికి గృహపరిత్యాగం చేస్తున్నాము అనే తలంపు లేకుండా చేసారు. వారిలాగ పోల్చుకోవద్దు. సమాజం విడిచిపెట్టి పారిపోనక్కరలేదు. సమాజంలో ఉండి పనిచేస్తూకూడా తరించవచ్చు. పని నిర్మలంగా చెయ్యి, చేసి మర్చిపో. నీవు నిర్మలంగా, నిశ్చలంగా, స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే పూర్వజన్మనుండి వచ్చిన వాసనలు అన్నీ ఎండిపోయి రాలిపోతాయి. మనిషి సాధారణంగా జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఉంటాడు, జరగబోయే విషయాలు గురించి ఊహిస్తూఉంటాడు. వీటివలన వర్తమానకాలం వృథా అయిపోతుంది. వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొంటే మనకు జ్ఞానం కలుగుతుంది. మీరు లోకాన్ని భయపెట్టకండి, లోకాన్ని చూసి భయపడకండి అని పరమాత్మ చెప్పాడు. లోకం అంటే ఇట్టిది కదా అని లోకం యొక్క స్థితిఅర్థమయితే లోకం అంటే భయం పోతుంది. ఇతరులను హింస పెట్టవద్దు, ఆందోళన పెట్టవద్దు. ఇతరులు ఎవరైనా మిమ్మల్ని ఆందోళన పరచినా మీరు ఆందోళనపడవద్దు. ఇతరులు అంటే ఎవరో మీకు అర్థమయితే వారు ఆందోళన పరచినా మీకు ఆందోళనరాదు. సమాజమును విడిచిపెట్టి ఎక్కడికి పారిపోనక్కరలేదు. అహంకారాన్ని, మమకారాన్ని విడిచిపెడితే లోపలఉన్న ఈశ్వరుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు.

ఏదో మతంలో ఉండటంవలన జ్ఞానంరాదు. హృదయంలో సత్యంఉంది. దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఆనందం. అది అనుభవంలోనికి వచ్చినప్పుడు మోక్షం. ఆత్మను తెలుసుకోవటానికి ఎంతశ్రద్ధగా ఉంటున్నారో పనిలోకూడా అంతశ్రద్ధగా ఉండు. ఈవిధంగా జీవిస్తూ ఉంటే నీకు వినయసంపద వస్తుంది. ప్రతీచిన్న విషయంకూడా శ్రద్ధగా చేయాలి. ఇతరులు నిన్ను అగౌరవపరస్తూ ఉన్నా నీవు వారిని గౌరవించు. వారు నిన్ను అగౌరవపరుస్తున్నారని నీవు కూడా వారిని అగౌరవపరిస్తే అది లోకంలో అందరు మనుషులు చేసేపని. నీవు కూడా అలాచేస్తే నీకు మోక్షం ఎలా కలుగుతుంది. లౌకిక మానవులు చేసినట్లుగా నీవు చేస్తే ఎలాగ? నీవు సత్యాన్వేషకుడవు, నీకు ఒక గమ్యం ఉంది, నీవు అలా చేస్తే ఎలాగ? ఒకగమ్యం అంటూ లేనివాడు ఎలా జీవిస్తున్నాడో వాడిని అనుసరిస్తే నీకు మోక్షంఎలా కలుగుతుంది, వాడిని ఆదర్శంగా తీసుకొంటే నీవు ఎలా బాగుపడతావు. లక్ష్యంలేని వాడిని అనుకరిస్తే వాడితో సమానం అవుతావుగాని నీకు మోక్షం ఎలా కలుగుతుంది. మీరు దేహబుద్ధిలో నుండి బయటకువస్తే ఎవరైనా మిమ్మల్ని విమర్శించినా మీకు ఎర్రచీమకుట్టినట్లుగా కూడా ఉండదు. దేహం ఉండగానే దేహం నేను అనే తలంపులో నుండి విడుదల పొందితే నీవు ఎప్పుడూ ఉంటావు అనే అనుభవం నీకు కలుగుతుంది. ధర్మాన్ని ఆచరించమని భాగవతంలో ఎక్కువగా చెప్పాడు. ఇతరులు నీపట్ల ధర్మంగా లేకపోయినా నీవు వారిపట్ల ధర్మంగా ఉండు. ఇతరులు నీపట్ల ఎలా వ్యవహరిస్తే నీకు బాధకలుగుతుందో



అలాగ నీవు ఇతరులపట్ల వ్యవహరించవద్దు. ధర్మాన్ని ఆచరించటం వలన ఆరోగ్యం వస్తుంది, ఐశ్వర్యం వస్తుంది, అన్నీ వస్తాయి అంతేకాదు మోక్షం కూడా వస్తుంది. కాని మనం అందరము ధర్మాన్ని విడిచిపెట్టేసాము. కొన్ని కొన్ని విషయాలు మనకు అర్థంకావు, భగవంతుడు చెప్పినట్లుగా చేయాలి. ధర్మాన్ని ఆచరించమని భగవంతుడు చెప్పాడు కాబట్టి ఆచరించాలి. మంచివాడిని చెడ్డవాడుగా చేయటం తేలిక, చెడ్డవాడిని మంచివాడిగాచేయటం చాలాకష్టం. నీవు ధర్మాన్ని ఆచరించటంవలన, ధర్మబుద్ధి వలన శరీరానికి సంబంధించిన కంఫర్ట్సు వస్తాయి, అంతేకాదు బాగా పండినపండు నారమల్‌గా చెట్టునుండి ఎలా విడిపోతుందో అలాగ శరీరానికి మరణం వచ్చేలోపు అజ్ఞానంలోనుండి విడిపోతావు. ధర్మాన్ని ఆచరించటంవలన ఇహం. పరం అన్ని వచ్చేస్తాయి. ఎవరికైనా మనం చెప్పవలసింది చెప్పాలి లేకపోతే మన డ్యూటీ విడిచిపెట్టినట్లుఅవుతుంది. చెప్పినా వినకపోతే వాడి ప్రారబ్ధానికి వదిలివేయాలి. జీవితంలో జయంవస్తూ ఉంటుంది. అపజయం వస్తూ ఉంటుంది. జయం నేర్వేపాఠాలు ఉంటాయి, అపజయం నేర్వేపాఠాలు ఉంటాయి. మీరు భక్తులైనా మీరు అనుకొన్నపనులు అన్ని అయిపోతే మీకు గర్వం రావచ్చు. ఆపనులు అవ్వటం వలన వచ్చేలాభం కంటే మీకు వచ్చిన గర్వం మిమ్మల్ని ఎక్కువ పాడుచేస్తుంది. మీకు జయం వచ్చినప్పుడు గర్వం తీసుకొనివస్తుంది. జయం వచ్చినప్పుడు మీరు గర్వరహితంగా ఉంటే దాని వలన ప్రమాదం లేదు, గర్వం వస్తేమటుకు మీపతనం ప్రారంభమవుతుంది. మనం తోటిమానవులపట్ల నిర్వర్తించవలసిన ధర్మం నిర్వర్తించటంలేదు. కొంతమంది ఎంతసేపు వారిగురించే ఆలోచిస్తూ ఉంటారు. వారిగురించి 50% ఆలోచించుకొని ఇతరులగురించి 50% ఆలోచిస్తే శరీరం, మనస్సు తేలిక అవుతుంది. నీకు ఉన్న అవరోధం నీమనస్సే. నీమనస్సును సంస్కరించుకో. మనస్సుకు ధర్మాన్ని ఆచరించటం నేర్పు. మనస్సుకు ధర్మాన్ని ఆచరించటం నేర్పితే ఆమనస్సే నిన్ను మోక్షానికి తీసుకొనిపోతుంది. నీకు వచ్చే ప్రతి తలంపు విషయంలో జాగ్రత్తగా ఉండు. చొక్కామీద తేలుపడితే వెంటనే దులుపేసుకొంటాము. కాని మనకు చెడుతలంపులు వస్తూ ఉంటే వాటిని దులుపుకోము. చెడుతలంపులు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. అశ్రద్ధ పనికిరాదు. ప్రతీ చిన్నవిషయానికి గొడవలు పడకుండా ప్రపంచ పరిస్థితులను, కుటుంబపరిస్థితులను అర్థం చేసుకొని కొంతరాజీపడి జీవించండి. మీగమ్యాన్ని విడిచిపెట్టవద్దు. మీరు ఆత్మజ్ఞానం సముపార్జించాలి. అదే మీ జీవితగమ్యం. దానిని మిస్ అవ్వవద్దు. భౌతికంగా మీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా, మిమ్మల్ని గౌరవపరచినా, అగౌరవ పరచినా ఇవి తాత్కాలిక విషయములు. వాటిని పట్టించుకోవద్దు. అవి ఎలా వచ్చాయో అలాగే పోతాయి. మీరు ఇతరులను ఆక్షేపించవద్దు. మీరు ఏ విషయం గురించి ఇతరులను ఆక్షేపించారో వచ్చే జన్మలో అదేవిషయంలో

భగవంతుడు మిమ్మల్ని పెడతాడు. అందువలన బహుజాగ్రత్తగా ఉండండి.

దేహం అహంకారం కాదు కాని దేహప్రారబ్ధంలో వచ్చే సంఘటనలతో తాదాప్యం చెందితే అహంకారం పెరిగిపోతుంది. అంటే అహంకారం పెరగటానికి మీదేహం సహకరిస్తోంది. కొంతమంది ఇతరులతో పోల్చుకొని వారికంటే గొప్పగా ఉంటున్నామని శరీరపోషణకు సంబంధించిన విషయాలు ఆలోచిస్తూ శరీరమే ఆత్మ అనుకొంటూ ఉంటారు. కొంతమంది తెలివితేటలే ఆత్మ, మంచితనమే ఆత్మ అనుకొంటారు. ఇలా ఎక్కడో ఒకచోట దేహం దగ్గర, తెలివిదగ్గర, మంచితనం దగ్గర ఆగిపోతారు, గమ్యాన్ని చేరలేకపోతున్నారు. బంగారం పట్టుకొందామని బయలుదేరుతున్నారు పిడకలదగ్గర, పుల్లలు దగ్గర ఆగిపోతున్నారు. మనం ఏమి చేయాలి అంటే హృదయంలో ఉన్న బంగారం దొరికేవరకూ లోతులకు వెళ్ళాలి, మధ్యలో వచ్చే ఆకర్షణల దగ్గర ఆగిపోకూడదు. గమ్యాన్ని చేరేవరకూ ప్రయత్నం విడిచిపెట్టవద్దు. ఇతరులు మీపట్ల ప్రోపర్‌గా ప్రవర్తించకపోయినా అది భరించగలగాలి. ఇతరులు మీపట్ల ఎద్దైనా పొరపాటు చేసినా మీకు ప్రతీకారబుద్ధి ఉండకూడదు. మీరు జ్ఞానసముపార్జన చేసే ప్రయత్నంలో ఉన్నారుకాబట్టి సత్పురుషుల సహవాసం వదలవద్దు. సత్పురుషుల సహవాసం దొరకకపోతే ఒంటరిగా జీవించటానికి ప్రయత్నంచేయండి. ఆధ్యాత్మిక అభివృద్ధికి శాంతచిత్తం ఎంతముఖ్యమో ధైర్యంకూడా అంతే ముఖ్యం. ధర్మాన్ని ఆచరించేవాడికి విపరీతమైన ఆత్మవిశ్వాసం వస్తుంది, ఆత్మబుద్ధి కలుగుతుంది, భయరహితుడవుతాడు. కులం మార్చుకుంటే, మతం మార్చుకుంటే, బట్టలు మార్చుకుంటే జ్ఞానం వస్తూ ఉంటే ఇక సాధనలుఎందుకు? ఇటువంటి వాటి వలన జ్ఞానంరాదు. అందువలన మీ నిదానంలో మీరు ఉండండి, సొంతబుద్ధిని విడిచిపెట్టవద్దు. ఎవరైనా ఏదైనా చెప్పేటప్పుడు అందులో మీకు ఉపయోగపడే మాటలు ఏమి ఉన్నాయి అని ఆలోచించుకోండి. ఉపయోగపడేమాటలు తీసుకోండి, ఉపయోగంలేనివి వదిలివేయండి, విమర్శలు వద్దు. గంగానదిలో దీపాలు వెలిగించిపడవేస్తారు, నిప్పలు పడవేస్తారు. ఎవడు నా మీద నిప్పలు వేసాడు అని గంగానది చూడదు, నిప్పను ఆర్పివేసి దాని ప్రవాహమే ప్రవాహం, సముద్రం లోనికి వేళ్ళే వరకు దాని ప్రవాహం ఆగదు. అలాగే మీరు కూడా ఉండాలి. లోకంలో జరిగే సంఘటనలు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వాటి గొడవలోనికి వెళ్ళవద్దు. మీగమ్యాన్ని చేరేవరకు ప్రయత్నం ఆపవద్దు. నీవు ఎక్కడున్నా, ఏపనిచేస్తున్నా గమ్యాన్ని మర్చిపోవద్దు.

ఓం నమోభగవతే శ్రీరమణాయ



## రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 24-3-02, చిలుకూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సాధనవల్ల అన్ని సాధించవచ్చు అయితే సంకల్పబలం ఉండాలి, ఆత్మవిశ్వాసం ఉండాలి. ఆత్మవిశ్వాసం లేకపోతే ఏపనిచేయలేము. ముందు మనమీద మనకు నమ్మకం ఉండాలి రామచంద్రమూర్తి పైకి సామాన్య మానవుడిలా కనబడేవాడు. కాని లోపల చాలాబలంగా ఉండేవాడు. మనం కూడా పైకి అందరిలాగే కనబడాలి, నెమ్మదిగా లోపలబలం పెంచుకొంటూరావాలి. కొంతమందికి ఎంత వయస్సువచ్చినా వారికి సొంతఆలోచన ఉండదు. ఆలోచన అమృతంతో సమానము. ఉపనిషత్‌లు చదివాము, గీత చదివాము అంటే సరిపోదు. అవి చదవటం మంచిదే అంతమాత్రంచేత జ్ఞానం రాదు. శరీరానికి రోగాలు వచ్చినట్లే మనస్సుకు కూడా రోగాలు వస్తాయి. శరీరానికి వచ్చే రోగాల కంటే మనస్సుకు వచ్చేరోగాలు ప్రమాదమైనవి. శరీరానికి వచ్చే రోగాలు ఆశరీరం మరణించినప్పడు రోగాలు కూడా పోతాయి. కాని మానసిక రోగాలు రాబోయే జన్మకు మనకూడా వచ్చేస్తాయి. అందువలన మానసికఆరోగ్యం కాపాడుకోవటం చాలా ముఖ్యం. అయితే శారీరక ఆరోగ్యనికి ఇచ్చే ప్రాముఖ్యత మనం మానసిక ఆరోగ్యానికి ఇవ్వటంలేదు. మానసిక ఆరోగ్యం బాగుంటే శారీరక ఆరోగ్యం బాగుంటుంది. ఎందుచేతనంటే ఈశరీరం ఎవరిది అంటే మనస్సుది. మానసిక ఆరోగ్యం కాపాడుకోవటానికి కొంతసాధనచేయాలి. కొంతమందికి ఏదైనా చెపితే చిరాకు, చెప్పకపోతే పరాకు అంటారు. ఇటువంటి జనం మధ్యన సమాజంలో మనం బ్రతుకుచున్నాము. వారితోపాటు కొట్టుకొనిపోతే మనకు సాధనలేదు, భక్తిలేదు. మన ఇంట్లో చిరాకుపడేవారి మధ్యన చిరాకులేకుండా ఉంటే అదిసాధనగాని ఏదో 12 వ అధ్యాయం చదివాము అంటే అది చదవటం మంచిదేగాని రెండవ పక్షం. మీరు ఉద్రేకంగా మాట్లాడుతూఉన్నా నేను ఉద్రేకం లేకుండా సమాధానం చెపితే అదిసాధనాబలం. ఏదో పుస్తకాలు చదవటం వలన ఇది వచ్చేస్తుంది అని అనుకోవద్దు. మనం ఏదైనా శాస్త్రం చదివినప్పడు దానిని అర్థం చేసుకొని, దానికి అనుగుణంగా మన జీవితవిధానాన్ని మలచుకోవాలి. ఆత్మజ్ఞానం అనేది శాస్త్రపాండిత్యం వలన వచ్చేదికాదు, తర్కాలవలన వచ్చేదికాదు, యుక్తివలన వచ్చేదికాదు, కీర్తివలన వచ్చేదికాదు. అంతఃకరణశుద్ధి

వలన మనకు జ్ఞానం కలుగుతుంది. అంతఃకరణ శుద్ధి అవ్వాలంటే ఎంతోకొంత సాధనచేయాలి. నీమనస్సును నాకు అర్పించు అని భగవంతుడు చెపుతాడు. మనమనస్సును ఆయనకు అర్పిస్తే అది నశిస్తుంది. భగవంతుడు మనకు ఇచ్చిన పనిని అర్పణభావంతో శ్రద్ధగా చేస్తే మనస్సు పరిశుద్ధం అవుతుంది. మనం చేసేపని శ్రద్ధగా చేస్తే, అర్పణభావనతో చేస్తే, కర్మఫలం పట్ల ఆసక్తిలేకుండా చేస్తే మనకు లోకవాసన, దేహవాసన తగ్గుతుంది.

స్థూలశరీరంలో మాంసం, ఎముకలు, రక్తం ఇవి అన్నీ ఉంటాయి. సూక్ష్మశరీరంలో వాసనలు, కోరికలు అన్నీ ఉంటాయి. గాఢనిద్రలో మనం వీటి రెండింటిలోనుండి విడిపోతున్నాము. జాగ్రదవస్థలోనికి వచ్చాక మనకు దేవుని గొడవలేదు, ఆత్మగొడవలేదు, జ్ఞానం గొడవలేదు. ఉదయం లేచినది మొదలు రాత్రి పడుకొనే వరకు ఈదేహం తప్పితే ఆదేహం, ఆదేహం తప్పితే ఈదేహం ఇదేగొడవ. కొంతమంది మనస్సు గొడవ, కొంతమంది దేహం గొడవ చెపుతూఉంటారు. ఇంక దేవుడిగొడవ  ఎవరికి లేదు. గాఢనిద్రలో మనకు ఏమీ తెలియదు. సాధన ఏమీ ఉండదు - జాగ్రదవస్థలో ఎంతసేపు దేహం గొడవ, మనస్సు గొడవ. ఇవి రెండూ మనం కాదు. వీటి రెండింటిలో నుండి విడుదల పొందటానికే నారాయణుని పాదాలను ఆశ్రయించాలి. నిన్ను నీవు తెలుసుకో అంటారు నన్ను నేను తెలుసుకొంటే దేవుడు తెలుస్తాడా అని అడుగుతున్నారు. నిన్ను నీవు తెలుసుకొంటే దేవుడు తెలుస్తాడు. భగవంతుడు నీలోపలే ఉన్నాడు. నేను అనే తలంపు దేవుడి దగ్గరనుండే వస్తోంది. దానిని పట్టుకొని దానిమూలం లోనికి వెళితే దేవుడు తెలుస్తాడు. అందుచేత మీ సాధనలో మిథ్యానేనును ఇన్వాల్వ్ చేయండి. ప్రపంచం అంతా కామక్రోధముల చుట్టూ తిరుగుతోంది. వీటిలో నుండి బయటపడితే వాడికి మోక్షం కలుగుతుంది. మనం వినయం, వివేకం కాపాడుకోవాలి. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన  విశ్వాసంతో జీవించాలి. మనం ఏదైనా పనిచేస్తే దానివలన భగవంతుని దయ వస్తుంది అని మనం పనులు చేయటంలేదు. ఎవడి మీద అయినా కోపం ఉంటే వాడి మీద కక్ష తీర్చుకోవటానికి కొన్ని పనులు చేస్తాము, ఎవడిమీద అయినా ఇష్టం ఉంటేవాడు బాగుపడటానికి కొన్ని పనులు చేస్తాము వాడుబాగుపడినా, బాగుపడకపోయినా. ఇలా చేస్తే ఇష్టంతోగాని, అయిష్టంతో గాని పనులు చేస్తాము. దీనివలన అజ్ఞానం ఎలా నశిస్తుంది, దేవుని దయకు ఎలా పాత్రులవుతాము. మనం విషయాలను ధ్యానం చేస్తున్నాము గాని భగవంతుని ధ్యానం చేయటంలేదు. మీ అబ్బాయికి మీరు ఉపయోగపడితే అమ్మా, అమ్మా

20-04-2002



అంటాడు లేకపోతే బొమ్మ అంటాడు. ప్రతీమనిషికి వాడంటే వాడికి ఎక్కువ ఇష్టం. నేను అంటే నాకు ఎంత ఇష్టమో  అంత ఇష్టం మీ మీద నాకు ఉంటే అప్పుడు కదా నాకు జ్ఞానం కలిగేది? మనకు అలాగ ఉందా? నాక్షేమం నేను ఎలా కోరుకుంటున్నానో అలాగ మీక్షేమం కూడా నేను కోరుకొంటే అప్పుడు ఈశ్వరుడు ఆయన కరుణను కురిపిస్తాడు. నన్ను నేను ప్రేమించుకొన్నట్లుగా మిమ్మల్ని ప్రేమించగలుగుతున్నానా? లేదు. అంటే ఎక్కడో దోషం ఉంది, ఎక్కడో వేరుభావన ఉంది. దానిని నశింపచేసుకోవాలి. అదినశిస్తే ఇప్పుడు నా శరీరంతో నాకు తాదాప్యం ఎలా ఉందో అలాగ సృష్టితో నాకు తాదాప్యం వస్తుంది. ఎంతసేపు నామనస్సు బాగాలేదు, నాశరీరం బాగాలేదు అంటే ఇంకమీరు సృష్టిని ఏమి ప్రేమిస్తారు. మనలను మనం మరచిపోవటం వలన మనకు తొందరగా ఆత్మజ్ఞానం కలుగుతుంది.

అందరూ నన్ను ద్వేషిస్తూ ఉన్నా ఎవరిపట్ల ద్వేషం లేకుండా నేను ఉంటే భగవంతుని స్వరూపం దగ్గరకు వెళ్ళిపోయినట్లే. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఈ ఆకర్షణలమధ్యన ఆకర్షణలేకుండా నేను ఉండగలిగితే భగవంతుని దగ్గరకు వెళ్ళిపోతాము. ఇదిమంచి, ఇది చెడు అని లోపలనుండి చెపుతూ ఉంటే చెడును ప్రక్కకు పెట్టి మంచిని చేయగలిగితే నీవు ఈశ్వరుని దగ్గరకు వెళ్ళిపోతావు. మనకు ఎవరిమీద అయినా ద్వేషంఉంటే వారిలో ఉన్నమంచికూడా చెడుకింద మనకు కనబడుతుంది.  మనలో ఉన్న ద్వేషం వారిలో ఉన్నమంచితనాన్ని గుర్తించనివ్వదు. నీహృదయంలో ఉన్నభగవంతుడిని నీవు దర్శించకుండా నీ మనస్సు అడ్డు వస్తోంది, నీమనస్సు యొక్క చాపల్యం, నీమనస్సులో ఉన్నదోషములు, విపరీతధోరణులు అడ్డువస్తున్నాయి. నీమనస్సును మిత్రుడిగా చేసుకొని  దానిని బాగుచేసుకొంటే ఇతరులు ఎవరూ చేయలేని సహాయం నీ మనస్సే నీకు చేసిపెడుతుంది. నీ మనస్సును స్వాధీనం చేసుకొంటే నీవు ప్రారబ్దమును జయించవచ్చు, మృత్యువును జయించవచ్చు. మాకు మోక్షం ఎప్పుడు వస్తుంది, మాకు జ్ఞానం ఎప్పుడు వస్తుంది అని అడుగుతున్నారు. ఇవి నిజమైన భక్తుడు అడిగే ప్రశ్నలుకాదు. నిజమైన భక్తుడు ఏమీ అడగడు. భక్తుడికి భగవంతుని పాదాలు తప్పించి ఏమీ అక్కరలేదు. ఆయన ఏది ఇస్తే అది ఎప్పడు ఇస్తే అప్పడు తీసుకొంటాడు. నీమనస్సును నాకు అర్పించండి అన్నీ నేను చూసుకొంటాను అని భగవంతుడు చెపుతున్నాడు. ఆయనకు అర్పించటం మానివేసి, శరణాగతి చేయటం మానివేసి అది ఇంకా రాలేదు ఏమిటి అంటే అది ఎప్పడు ఇవ్వాలో అర్హతనుబట్టి అది వస్తుంది.

**రమణ భాస్కర**

ఎప్పడు ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో భగవంతుడికి తెలుసు. దానిగురించి టైముపాడు చేసుకోవద్దు. భగవంతుని పాదాలయందు భక్తిని విడిచిపెట్టవద్దు. దేహానికి రోగం వస్తే హాస్పటల్స్‌కు తిరుగుతున్నాము. మానసిక అనారోగ్యం నుండి బయట పడటానికి ప్రయత్నం చేయటం లేదు. మానసిక అనారోగ్యం నుండి బయటకు రా.  లోపలఉన్న వస్తువు గోచరమవుతుంది. కొంతమంది మాట్లాడుతూ  ఉంటే అది వాడికి  ఉపయోగపడదు, ఇతరులకు ఉపయోగపడదు. అహంకారం ఉన్నవాడు ఏమి చెపుతాడు. అహంకార రహితుడు, మమకార రహితుడు జ్ఞానంగురించి చెప్పాలిగాని అహంకారం ఉన్నవాడు, మమకారం ఉన్నవాడు జ్ఞానం గురించి ఏమి చెపుతాడు.  భగవంతుని పాదాలను ఆశ్రయించి ఉంటే అప్పడు అహంకారం నుండి, మమకారం నుండి విడుదల పొందుతావు, నీవు ఏదైతేకాదో అందులో నుండి విడుదల పొందుతావు.

భగవంతుడు ఉన్నాడా, లేడా అని మనం అనుకొంటూ ఉంటాము. భగవంతుడు ఉన్నాడు.  భగవంతుడు ఉన్నాడా, లేడా అనుకొనేవాడు మాత్రం ఇప్పడూ లేడు, ఎప్పడూలేడు. లేనిదానిని ఉంది అనుకొంటున్నాము. అది నీ పీక పట్టుకొంటోంది. ట్రైన్ యాక్సిటెండ్ అయ్యి 400 మంది చనిపోయారు అంటే మనకు ఎర్రచీమ కుట్టినట్లుగా కూడా ఉండదు కాని మనఇంటిలో 90 సం॥లు వయసు ఉన్నవారు చనిపోయినా మనకు విపరీతమైన దుఃఖం వస్తుంది. కొంతమంది ఎలా ఉంటారు అంటే ఇతరులకు ఏదైనా కష్టం వస్తే వారికే వచ్చినంత బాధపడిపోతారు. అది వారికి మానవజాతితో, ఈసృష్టితో ఉన్న తాదాప్యం. పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ మనస్సును నియమించటానికి, మనస్సుకు లోచూపు కలుగజేయటం కోసం. మీరు పూజ, జపం, ధ్యానం చేస్తున్నారు అనుకోండి. వాటి వలన పుణ్యం వచ్చింది అనుకోండి, ఆపుణ్యం అనుభవిస్తే పోతుంది. ఏది శాశ్వతంగా ఉంటుంది అంటే మీరుచేసే పూజ వలన, జపం వలన, ధ్యానం వలన మీకు విషయములపట్ల వాంఛ తగ్గుతూ ఉంటే మీకు మానసిక ఆరోగ్యం బాగుంటుంది. మోక్షం కూడా కలుగుతుంది. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది. అది మనకు అర్థమయితే సుఖం, అర్థంకాకపోతే దుఃఖం.  ఈశ్వర సంకల్పానికి భిన్నంగా ఏమీ జరగదు. ఈసృష్టి యొక్క నడక అంతా ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతోంది. ప్రకృతిలో ఎండలు, గాలివానలు, భూకంపాలు, పేచీలు వస్తూ ఉంటాయి వాటిని నీవు ఆపలేవు. అది ఈశ్వరసంకల్పం. నీవు చేయవలసిన పని ఏమిటి అంటే నీ మనస్సులో ఉన్న కుటిలత్వంలో నుండి బైటకురా. అసలు మనకు కుటిలత్వం ఉంది అని మనకు తెలియటంలేదు ఇంక అందులో నుండి బయటకు రావటానికి ఏమి ప్రయత్నం చేస్తాము. శ్రవణం చేయటం వలన మనలో ఉన్న కుటిలత్వం గురించి మనకు తెలుస్తుంది.

ఇతరులను విమర్శించటం వలన మనకు కలిసివచ్చేది ఏమిలేదు. మనలను మనం విమర్శించుకోవటం మంచిది. ఇతరులను విమర్శిస్తూ ఉంటే లోకవాసన, దేహవాసన పెరిగిపోతుంది. మనలో ఉన్న బలహీనతలనుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయాలి. నీవు ఏ విషయాలనుచూసి మోహపడుతున్నావో అందులోనుండి బయటకురా.  మనస్సు బైటకు వెళితే బంధం మనస్సు లోపలకు వెళితే మోక్షం. ఎటు పంపాలో నీవు నిర్ణయించుకో, జాగ్రత్తగా ఆలోచించుకో. సాధన అంటేఏమిటి అంటే, నీకు ఈశ్వరునియందు నిజంగా ప్రేమ ఉంటే దానికి గుర్తు ఏమిటి అంటే నిరంతరం ఆందోళన పడే వారి మధ్యలో కూడా నీవు ఆందోళన లేకుండా ఉండగలగాలి. భగవంతుడు ఉన్నాడు, ఉన్నాడు అని చెప్పారు. ఉంటే ఎలా ఉన్నాడు అని ప్రశ్న.  అశాశ్వతమైన శరీరం, చంచలమైన మనస్సులో శాశ్వతంగా ఉన్నాడు, వీటికి ఆధారంగా ఉన్నాడు, వాటికి అతీతంగా ఉన్నాడు, అయితే ఆయన నీశరీరంలో ఒక భాగం కాదు. నీశరీరంలో రోగాలు,  మనసులో వికారములు ఉంటాయి. ఈరోగాలకు, వికారములకు సంబంధం లేకుండా, వాటికి అతీతంగా స్వచ్ఛంగా ఉన్నాడు, చైతన్యంగా ఉన్నాడు. చైతన్యానికి రూపంలేదు. నామంలేదు.  ఫలానా పేరునాది, ఫలనారూపం నాది అనే నేనులోనుండి విడిపోవాలి.  అప్పడు లోపలఉన్న చైతన్యం నీచేతికి అందుతుంది.  సాధనచేసి, అన్ని విధములుగా ప్రయత్నంచేసి ఈశరీరం ఉండగానే రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలోనుండి విడుదలపొందండి. ఎవరైనా ఏదైన బలహీనతలతో బాధపడుతున్నారు అనుకోండి వారిని విమర్శించకూడదు. ఆబలహీనతలనుండి ఆ వ్యక్తిని విడుదలచేయమని భగవంతుని ప్రార్థించాలి.  ఫలానా పేరునాది, రూపం నాది అని వాటితో తాదాప్యం చెందితే అహంకారంలో అజ్ఞానంలో పూర్తిగా మునిగిపోయినట్లే. డైరెక్టుగా చైతన్యం మీద నీ మనస్సును నిలబెట్టలేకపోతే, ఏదైనాఒక అవతారపురుషుని మీద నీ మనస్సును నిలబెట్టు. ఎందుచేతనంటే వారి దేహం కూడా ఆత్మే, అది ప్రారబ్దం వలన వచ్చినదికాదు. శాంతి, పవిత్రత ఉంటే నీవు కుటిలత్వం నుండి బయటకు వస్తావు. మనస్సును బంగారం చేసుకొన్న వాడికి శాంతి, పవిత్రత వస్తుంది. శాంతి , పవిత్రత ఇవి రెండూ ధైర్యం ఉన్నవాడికే వస్తాయి గాని పిరికి వారికి ఇవిరావు. ఇవి రెండూ సంపాదిస్తే మనం సురక్షితంగా గమ్యాన్ని చేరుకొంటాము.

**రమణ భాస్కర**

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-04-2002, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణుడిని ప్రేమించండి, కృష్ణుడిని పూజించండి, కృష్ణుడిని జ్ఞాపకం పెట్టుకోండి, మీ హృదయంలో కృష్ణుడికి కొద్దిచోటు ఇవ్వండి, కృష్ణుడికి శరణాగతి చెయ్యండి, కృష్ణుడి యొక్క కధలను వినండి అని కృష్ణభక్తులు చెపుతూ ఉంటారు. Love Krishna, Workship Krishna, Remember Krishna, Take refugee in Krishna, Listen the stories of Krishna అని కృష్ణభక్తులు చెపుతారు. కోరికలు పెంచుకోవద్దు. కోరికలు పెంచుకొంటే పునర్జన్మకు కారణాలు పెరుగుతాయి. మీలో ఆశ ఉంటే తగ్గించుకోండి, దురాశ దుఃఖానికి కారణం అవుతుంది. చేయగలిగినంత వరకు ఇతరులకు సహాయం చేయండి. దేనికి భయపడవద్దు. ఉన్నది బ్రహ్మం ఒక్కటే. ఇంక దేనిని చూసి భయపడతారు. మీలో భయం ఉంటే ఎంతసాధన చేసినా అభివృద్ధి కనబడదు. జీవితంలో కష్టం, సుఖం వస్తూ ఉంటాయి. మంచి చెడూ వస్తూ ఉంటాయి. ఇది ప్రకృతి. ఏ రెండు మనసులు ఒకలాగ ఉండవు. ఎవరి స్వభావం వారిది. కాని లోపలఉన్న చైతన్యం ఒకటిగానే ఉంది. దానిని గుర్తించేవరకు, అది మనకు అనుభవంలోనికి వచ్చేవరకు ఈ ప్రకృతిలోనికి రావలసిందే, శరీరాలు ధరించవలసిందే. నాకు సుఖాలు వస్తున్నాయి, కష్టాలు వస్తున్నాయి. సుఖాలు వచ్చినప్పుడు ఓ ప్రభువా! నీ దయవలననే ఈ సుఖం వచ్చింది అనుకొంటున్నాను. కష్టం వచ్చినప్పుడు ఆ కష్టం పంపవద్దు అని భగవంతుడిని అడగటం లేదు, జీవితంలో కష్టం రాకుండా ఎలా ఉంటుంది. కష్టం వచ్చినప్పుడు ఆ కష్టాన్ని భరించే శక్తిని ఇయ్యి అంతేకాదు సుఖం వచ్చినప్పుడు అది నీ దయ అని ఎలా అనుకొంటున్నానో కష్టం వచ్చినప్పుడు ఇది కూడా నీ దయే అనుకొనే శక్తిని నాకు ప్రసాదించు అన్నాడు ఠాగూర్. భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు, ఆనందంగా ఉన్నాడు, సుఖంగా ఉన్నాడు, శాంతిగా ఉన్నాడు. అందువలననే మనం ఆనందం కావాలి, శాంతి కావాలి అని కోరుకొంటున్నాము. నన్ను మీరు తెలుసుకొంటే ఇవి అన్నీ మీకు వచ్చేస్తాయి, ఈ ప్రకృతి పేరు చెప్పి, వ్యవహారాలు పేరుచెప్పి నన్ను మర్చిపోవద్దు, ఈ ప్రపంచం అంతా మిధ్య అని భగవంతుడు చెపుతున్నాడు. జ్ఞానికి పరమాత్మ తప్పించి ఏమీలేదు, అజ్ఞానికి లోకం తప్పించి ఏమీలేదు. జ్ఞాని ఆత్మలో స్థిరపడి ఉంటాడు, చైతన్యంలో స్థిరపడి ఉంటాడు. అది తప్ప ఏదీ వాడికి గోచరించదు. జ్ఞానికి పొంగు, కృంగులు ఏమీ ఉండవు. ఆయనకు గౌరవం, అగౌరవం ఒక్కటే. మంచి, చెడు అని గుర్తింపులు ఆయనకు ఏమీ ఉండవు.

మిమ్మల్ని ఎవరైనా చిరాకుపరిస్తే తొందరగా ఉద్రేకపడతారు. మీరు దేనికి





ఉద్రేకపడవద్దు. మనం ట్రైనింగ్ పొందటానికి ఈ భూమి మీదకు వచ్చాము. క్రీస్తును శిలువ వేయటానికి తీసుకొనివెళ్ళేటప్పుడు దెబ్బలు కొడతారు, రక్తం కారుతూ ఉంటుంది, ఏ ప్రజల క్షేమం కోసం ఆయన జీవితం పొడుగునా కృషిచేసాడో, ఎవరికోసం ఆయన జీవించాడో ఆ ప్రజలుఅందరూ డబ్బు పుచ్చుకొని క్రీస్తుకు శిలువ వేయండి అని అరుస్తూ ఉంటారు. క్రీస్తు వారి అరుపులను వింటున్నాడు, వారి కళ్ళలో ఉన్న అసూయను చూస్తున్నాడు కాని నిర్వికారంగా ఉండగలిగాడు, ఏమీ చలించలేదు అందువలన ఆయన దేవుని కుమారుడు అయ్యాడు. అప్పుడు యెహోవాను ప్రార్థిస్తాడు వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు వారిని క్షమించి ఆశీర్వదించు అని ప్రార్థిస్తాడు. నీ శరీరానికి స్నానం ఎంత ముఖ్యమో, నీ మనస్సుకు స్నానం చేయించటం కూడా అంతే ముఖ్యం. మనస్సు నిర్మలమయితే, మనస్సు శుద్ధమయితే, మనస్సు పవిత్రమైతే అదే ఆత్మాకారం చెందుతుంది. మంచి సంకల్పంతో ఒక మాట మాట్లాడితే, మంచి సంకల్పంతో ఒక పనిచేస్తే నాకూడా సుఖం వెంటాడుతుంది. నా మాటలను ఈశ్వరుడు చూడడు. లోపలఉన్న సంకల్పమును ఈశ్వరుడు చూస్తాడు. మాటల వలన దేవుడిని మోసం చేయలేము. లోపల చెడుసంకల్పం పెట్టుకొని మంచిమాట మాట్లాడినా, చెడు సంకల్పం పెట్టుకొని చెడుమాట్లాడినా నిన్ను దుఃఖం వెంటాడుతుంది ఈ జన్మలోనేకాదు, రాబోయే జన్మలోకూడా. నా సంకల్పం మీద సుఖం, దుఃఖం ఆధారపడి ఉంది. అందువలన ఆలోచనలో జాగ్రత్తగా ఉండాలి. మన అభివృద్ధికి ఏ చెడుతలంపులు అడ్డుగా ఉన్నాయో చూసి వాటిని బయటకులాగి కాల్చి బూడిద చేయాలి. దానికి తగినశక్తిని ఇమ్మని భగవంతుడిని ప్రార్థించాలి. ఇహానికి, పరానికి పనికిరాని విషయాలను నీ శరీరం తోటేకాదు, నీ మనస్సుతో కూడా ముట్టుకోవద్దు.

జ్ఞానమార్గం వేరు, భక్తిమార్గం వేరు అనుకొంటాము. జ్ఞానమార్గం, భక్తిమార్గం, కర్మమార్గం ఇవి పరస్పర విరుద్ధమైనవికావు. ఒకదానికొకటి సహకరించుకొంటాయి. జ్ఞాన మార్గంలో ఉన్నవారు భక్తిమార్గంను ఖండిస్తారు. అలా ఖండించవలసిన పనిలేదు. ఇవి పరస్పరం సహకరించుకొంటాయి. మనం చేసేపని, మన ఆలోచన మన హృదయంలో ఉన్న భగవంతుడిని తెలుసుకోవటానికి సహకరించాలి. స్మశానంలో శరీరాన్ని కాల్చినప్పుడు మానసిక కర్మ కాలదు. మానసికకర్మ పునర్జన్మకు కారణం అవుతుంది. మానసికకర్మ పుల్లలతో కాలదు. మానసికకర్మకు, శరీరం యొక్క చావు పుట్టుకలకు, పుణ్యపాపాలకు అతీతంగా భగవంతుడు నీలోపలే ఉన్నాడు. ఆయన శాంతిగా ఉన్నాడు, జ్ఞానంగా ఉన్నాడు, చైతన్యంగా ఉన్నాడు. ఆయన అనుభవంలోనికి వచ్చినప్పుడు ఈ ప్రకృతి నిన్ను విడిచిపెట్టేస్తుంది. కొంతమంది వారిని పొగిడినా, విమర్శించినా కూడా మౌనంగానే ఉంటారు. మౌనం దేవుడు అన్న సంగతి

వారికి తెలుసు. మనకు అనేక తలంపులు వస్తాయి. ఇవి అన్నీ దేహమునేను అనే తలంపును బట్టి వస్తున్నాయి. అదే మూలతలంపు. ఆ మూలతలంపును పట్టుకొని దాని మూలంలోనికి వెళితే నీకు భగవదనుభవం కలుగుతుంది. నిరంతరం భగవంతుని జ్ఞాపకం పెట్టుకోవటంవలన నీలోపల ఉన్న శక్తి నీకు అందుతుంది, అది నీకు అనుభవం లోనికి వస్తుంది. ఆశక్తి జ్ఞానం లేకుండా ఉండదు. శక్తి అనుభవంలోనికి వచ్చినప్పుడు జ్ఞానం మిమ్మల్ని వరిస్తుంది. నీవు జ్ఞానమార్గంలో ప్రయాణం చెయ్యి, భక్తిమార్గంలో ప్రయాణం చెయ్యి, ఏమార్గంలో ప్రయాణంచేసినా అహంభావరహితస్థితిని పొందు.

జాగ్రదవస్థలో గాఢనిద్రాస్థితిని పొందు అని చెపితే అంటే ఏమిటి అని అడుగుతున్నారు. గాఢనిద్రలో నీవు అహంభావరహితస్థితిలో ఉంటున్నావు. గాఢనిద్రలో నీకు దేహం గొడవ, లోకం గొడవ, మనస్సు గొడవ ఏగొడవ లేదు. కాని నీ నిద్రను చూసేవాడు ఒకడు ఉన్నాడు. గాఢనిద్రలో నీకు ఏగొడవ లేనప్పుడు ఎవడైతే ఉన్నాడో వాడే దేవుడు. గాఢనిద్రలో నీవు అహంభావ రహితంగా ఉన్నావు. జాగ్రదవస్థలో కూడా అలాగ ఉండు. అలాగ ఉండటానికే ఈ భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం. అందరిలోను ఎవడైతే తనను చూసుకొంటున్నాడో, తనలో ఎవడైతే అందరిని చూసుకోగలుగుతున్నాడో వాడికి ద్వేషం ఎక్కడ ఉంటుంది, భేదబుద్ధి ఎక్కడ ఉంటుంది. అప్పుడు మానసికకర్మ ప్రొడ్యూస్ కాదు. మానసికకర్మ లేనప్పుడు పునర్జన్మ లేదు. నీలోపలఉన్న మలం బయటకు రావాలంటే మలం మలంద్వారా బయటకురాదు, ఈశ్వరుని స్మరించటంవలన లోపలఉన్న మలం బయటకు వస్తుంది. బయట ఉన్న మలాన్ని స్మరించటంవలన లోపలఉన్న మలం పోదు. లోపలఉన్న మలం బయటకు పోయి మనం పరిశుద్ధులం అయిన తరువాత లోపలఉన్న వస్తువు మనకు స్వరూపంగా గోచరిస్తుంది. నాకు అది కావాలి, ఇది కావాలి, నాకు ఇటువంటి జన్మకావాలి అని నీవుకానిదానితో దేనితో తాదాప్యం పొందినా అహంకారం, మమకారం పెరుగుతుంది, నీకు పునర్జన్మ తప్పదు. శరణాగతి పొందినవాడికి సొంత ఇష్టం అంటూ ఏమీ ఉండదు. భగవంతుడి ఇష్టమే వాడి ఇష్టం. అన్నీ ఆయన ప్రసాదమే అనుకొంటాడు. ఏది వచ్చినా అక్కడ గాయపడే వాడు ఉండడు. నీకు కోరికలు ఉన్నాయి అనుకో. కోరికల కోసం భగవంతుడిని ప్రార్థిస్తే కోరికలు నెరవేరతాయి గాని మీకు శరణాగతి రాదు. భక్తి ఉండాలి, కోరిక ఉండకూడదు. అది నిజమైన ప్రేమ. అప్పుడు అహంకారరహితస్థితిని పొందుతావు. మనం తెలియక ఏదో కోరుకొంటూ ఉంటాము. నీవు కోరుకొన్నది ఏదీ శాశ్వతంగా ఉండదు.

విషయాలు, విషయాలు అంటావు. వాటికూడా వెళ్ళే విషయి ఎవరు? ఆ విషయే విషయాలను కల్పిస్తోంది, అదే విషయాలకు ప్రాణం పోస్తోంది. ఆ విషయిని తీసి ఒక ప్రక్కన పెడితే విషయాలలో ఏమీలేదు అన్న సంగతి నీకు అర్థమవుతుంది. ఈ విషయి ఎవరు అని విచారణ చేసి విషయిని తొలగించుకొంటే ఇంక విషయాలు ఉండనే ఉండవు. చింతించే విషయాలు అన్నీ చింతించేవాడి మీద ఆధారపడి ఉన్నాయి. చింతించేవాడు ఎంతనిజమో ఆ విషయాలు కూడా అంతే నిజం. ఇవి అన్నీ వ్యవహారిక సత్యములేగాని పారమార్థిక సత్యములు కాదు. హిరణ్యకశపుడు ఎన్ని కష్టాలకు గురిచేసినా, ఎన్ని బాధలు పెట్టినా ప్రహ్లాదుడు నిర్వికారంగా ఉన్నాడు. భగవంతుడి పట్ల ఆయనకు ఉన్న భక్తి అటువంటిది. ప్రహ్లాదుడికి ఏదో కారణం వలన భక్తి రాలేదు, పుట్టుకతోనే భక్తి ఉంది. అందువలన ప్రహ్లాదుడు భక్తులలో అగ్రగణ్యుడు. నీవు వెతికే వస్తువు, నీవు అణ్వేషించే దేవుడు నీ హృదయంలోనే ఉన్నాడు. మినహాయింపులు లేకుండా ఆయనకు శరణాగతి చెందు. కాని ఆ లోతులలోనికి దిగటానికి మనకు తగిన వినయం లేదు, వైరాగ్యం లేదు, గుణసంపద లేదు. బాగా కాయలు కాచిన చెట్టునే కాయలకోసం కొడతారు, కాయలు కాయకపోతే దాని జోలికి వెళ్ళరు. అలాగే పనిచేసే మనిషినే తిడతారు. నీవు కష్టపడి పనిచేస్తూ ఉంటే నీ వెనకాల విమర్శలు వస్తాయి, కంగారు పడవద్దు, అది మానవ సహజం. ఈ సమస్యలను చూసి కంగారు పడవద్దు వాటినుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. వర్తమానకాలంలో జీవించండి. వర్తమానకాలంలో వచ్చే సమస్యలను పరిష్కరించుకోవటానికి ప్రయత్నం చేయండి. గతాన్ని గతంలో పూడ్చేయండి అన్నాడు వివేకానంద. వర్తమానకాలాన్ని సక్రమంగా ఉపయోగించుకొంటే మీ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుంది. ఎవరైనా మిమ్మల్ని ద్వేషిస్తూ ఉంటే ఆశ్చర్యపడనక్కరలేదు. అది మానవసహజం. మనకు బేధబుద్ధి ఉన్నప్పుడు రాగద్వేషములు వస్తూనే ఉంటాయి. పూర్వజన్మలో ఉన్న రాగద్వేషములు ఈ జన్మలో ప్రారబ్దం క్రింద వచ్చాయి. ప్రారబ్దమును నీవు కడిగేసుకోవచ్చు. ఇప్పుడు నీవు రాగద్వేషములు లేకుండా జీవిస్తే ఇంక ప్రారబ్దం లేదు, ఇంక శరీరాలు రావు. చావుపుట్టుకలను తీసుకొనివచ్చేది మానసికకర్మ. ఇదే పునర్జన్మను తీసుకొని వస్తుంది. అందువలన మీ మనస్సు ఎలా ఉందో జాగ్రత్తగా చూసుకోండి. భగవంతుని పాదాలకు శరణాగతి చెందుదాము అనుకొంటే మీ అహంభావన విజృంభిస్తుంది. అప్పుడు శరణాగతి భావన పెంచుకొంటూ వెళితే అహంభావన యొక్క శక్తి తగ్గుతూ ఉంటుంది. నామ రూపములతో మనం తాదాప్యం పొందుతున్నంతకాలం అహంభావన పెరుగుతూ ఉంటుంది. అది మనలను విడిచిపెట్టదు. అన్ని విధములుగా ప్రయత్నించి ఈశ్వరునికి శరణాగతి చెందుతూ అహంభావన నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. కాలం కలసివస్తుంది. అప్పుడు ఈశ్వరుని కరుణతో, శాంతితో మీ హృదయం కప్పబడుతుంది.

20-04-2002

**రమణ భాస్కర**

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 21-4-2002 | ఆదివారం | పాలకోడేరు రామాలయం, శ్రీరామనవమి మహోత్సవం |
| 27-4-2002 | శనివారం | కోడవిల్లి శివాలయం (వయా పాలకోడేరు) |
| 30-4-2002 | మంగళవారం | గరగపర్రు, షిరిడి సాయిబాబాగుడి, బస్‌స్టాండు దగ్గర |
| 2-5-02 నుండి | 13-5-02 | విశాఖపట్నం కాంపు |
| 07-5-2002 | మంగళవారం | విశాఖపట్నం సీతమ్మదార క్షత్రియ కళ్యాణమండపము |
| 19-5-2002 | ఆదివారం | జిన్నూరు శ్రీరమణ క్షేత్రంలో |
| 27-5-2002 | సోమవారం | పాలకోడేరు, షిరిడి సాయిబాబాగుడి, హైస్కూల్ దగ్గర |

ఏమనందును,నే నేమనందునూ
ఏమనందునూ, నే నేమనందునూ!
నాన్నగారి కన్నులలో ఉన్న విశేషం
వెన్నెలందునా, నెమలి వన్నెలందునా!
వెన్నెలనూ, వన్నెలనూ మించు విశేషం
ఎన్నటిదో 'జన్మాంతర మైత్రి' అందునా! ॥ఏమనందును॥

నాన్నగారి చిరునవ్వులో ఉన్న విశేషం
'గంధ'మందునా, 'మకరంద' మందునా!
గంధమునూ, మకరందమును మించు విశేషం
ఆత్మలోన విరిసిన 'హరివిల్లు' అందునా! ॥ఏమనందును॥

నాన్నగారి మోమునందు ఉన్న విశేషం
'శాంతి' యందునా, 'విమలకాంతి' అందునా!
శాంతి, కాంతి మించునట్టి వింత విశేషం
అంతులేని, అవధిలేని 'కరుణ' యందునా ॥ఏమనందును॥

నాన్నగారి హృదయంలో ఉన్న విశేషం
'అమృత' మందునా, 'ఆనంద'మందునా!
అమృతాన్ని, ఆనందాన్ని మించు విశేషం
అఖిల జగతి నింపివైచు 'ప్రేమ' అందునా! ॥ఏమనందును॥

నాన్నగారు సాక్షాత్తు 'రమణు'డందునా
నడచివచ్చు 'అరుణగిరి శివుడె' అందునా,
రాముడందునా, పరంధాముడందునా,
'ఆత్మ'యందునా, 'పరమాత్మ' అందునా! ॥ఏమనందును॥

- డా॥ ఆర్.ఎ. నాయక్

# నాగపూర్‌లో సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలు



నాగపూర్‌స్టేషన్‌లో శ్రీనాన్నగార్కి ఘనస్వాగతం

ది.7-4-2002 నాగపూర్ కళాభవన్‌లో మధ్యాహ్నం 2 గం॥లకు నాగపూర్ భక్తులు శ్రీనాన్నగారి ప్రవచనం ఏర్పాటు చేసినారు. సురేష్, వినోద్, వర్మ సభాకార్యక్రమములను నిర్వర్తించినారు. నాగపూర్ ఆంధ్ర మహిళాసంఘం అధ్యక్షురాలు - అరవిందని స్వాగతం చెప్పినారు.

ది.8-4-2002 న మహాత్మాగాంధీగారి ఆశ్రమం సేవాగ్రామ్‌ను శ్రీనాన్నగారు దర్శించినారు. సేవాగ్రామ్ కార్యదర్శి శ్రీనాన్నగార్కి స్వాగతం చెప్పి సేవాగ్రామ్‌లో సభను ఏర్పాటు చేసినారు. గాంధీజీ భోధలు గురించి శ్రీనాన్నగారు ప్రవచనం చేసినారు. అదేరోజున ఆచార్య వినోభాబావే గారి పవనార్ ఆశ్రమాన్ని సద్గురు శ్రీనాన్నగారు దర్శించారు. పవనార్ ఆశ్రమంలో శ్రీనాన్నగార్కి ఆశ్రమం తరపున ఆశ్రమ కార్యదర్శి దేవి స్వాగతం చెప్పినారు. శ్రీ నాన్నగారు గురువు మాత్రమే కాకుండా నాన్నగారు కూడా అని ఆవిడ ఆశ్రమవాసులకు శ్రీనాన్నగారిని పరిచయం చేసినారు.



రామ్‌టెక్ రామాలయంలో శ్రీనాన్నగారు కోతులకు ఆహారం ఇస్తున్న దృశ్యం

నాగపూర్‌లో ది.10-4-2002న డా॥ బి.ఆర్. అంబేద్కర్‌గారు భౌద్దమతం స్వీకరించిన దీక్షభూమిని కూడా దర్శించినారు. సాయంత్రం నాగపూర్ నుండి బయలుదేరి సామర్లకోట వెళ్ళినారు.